క్లుప్తంగా

రేపటి నుంచి పుస్తక ప్రదర్శన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు

తిరుపతి కల్చరల్: భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో వినాయకనగర్ క్వార్టర్స్ వద్ద నున్న మైదానంలో ఈ నెల 20వ తేదీ శని వారం నుంచి 28వ తేదీ వరకు 16వ పుస్తక ప్రదర్శన మహోత్సవం చేపడుతున్నట్లు భార తీయ విద్యాభవన్ డైరెక్టర్ ఎన్.సత్యనారాయ ణరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన పుస్తక ప్రదర్శన మహో త్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ జేఈవో సదా భార్గవి, ఎస్వీయూ మాజీ వీసీ, భారతీయ విద్యాభవన్ తిరుపతి కేంద్రం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పి.మురళి హాజరవుతారని తెలి పారు. సమావేశంలో ప్రొఫెసర్ దక్షిణమూర్తి, కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఖాళీ టిన్నుల విక్రయానికి సీల్డ్ టెండర్ల ఆహ్వానం

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయం తోపాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ టిన్నుల అమ్మకానికి రేటు కాంట్రాక్టు కింద సీల్డ్ టెండర్లను టీటీడీ ఆహ్వానిస్తోందని జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. టెండర్ పొం దిన వారు డిసెంబరు- 2024 వరకు టీటీడీ వినియోగించిన ఖాళీ టిన్నులు సేకరించ వచ్చని పేర్కొన్నారు. తిరుపతి హరేకృష్ణ రోడ్డులోని మార్కెటింగ్ (వేలం) కార్యాలయం లో సీల్డ్ టెండర్లు జనవరి 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు అందజేయాల న్నారు. ఇతర వివరాలకు మార్కెటింగ్ (వేలం) కార్యాలయాన్ని 0877-2264429 నం బరులో సంప్రదించాలని కోరారు.

పోలీస్ అధికారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైమ్: జిల్లా పోలీసు అధికారుల సం ఘం నూతన సంవత్సరం 2024 క్యాలెండర్‌ను జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి గురువారం ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నూతన సంవత్సరంలో పోలీసులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యవంతంగా విజ యవంతంగా ముందుకు సాగాలన్నారు. క్రమ శిక్షణతో విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతలు కాపాడుతూ ప్రజల ప్రేమానురాగాలు పొం దాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ వెంకట్రావు, ట్రైనీ ఐపీఎస్ అధికారి దేవరాజ్ మనీష్ పటేల్, జిల్లా పోలీసు అధికా రుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 28 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 72,263 మంది స్వామివారిని దర్శించుకోగా 25,263 మంది భక్తులు తలనీలాలు సమర్పిం చారు. స్వామివారికి కానుకల రూపంలో హుం డీలో రూ. 3.65 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుంది. దర్శన టికెట్లు లేని భక్తు లకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గం టల్లో దర్శనం లభిస్తోంది.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో టీటీడీ ఉద్యోగులు



చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డితో టీటీడీ ఎం ప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): రెండు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డిని టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు–టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీహ రి, కోశాధికారి రేఖ, డిప్యూటీ సెక్రటరీ ధరణి కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మోటార్ సైక్లిస్టుకు గాయాలు

రొంపిచెర్ల: ఆర్టీసీ బస్సు ఢీకొని మోటార్ సైక్లిస్టుకు తీవ్రగాయాలైన సంఘటన గురువారం మండలంలోని గానుగచింతలో చోటుచేసుకుంది. వివరాలు..ఎర్రావారిపాళెం మండలం యల్ల మంద తోటివారిపల్లెకు చెందిన జె.రమణ ద్విచక్రవా హనంలో రొంపిచెర్లకు వస్తుండగా రొంపిచెర్ల నుంచి గానుగచింతకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు జగ డంవారిపల్లె సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదం లో రమణకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం 108లో రొంపిచెర్లకు తరలిం చారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలిం చారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొండచుట్టులో శ్రీమూలస్థాన ఎల్లమ్మ, ధర్మరాజుల వారు, 20 ఏళ్ల తర్వాత ఎగువరెడ్డివారిపల్లికి అమ్మవారు వస్తుండడంతో వేచి ఉన్న గ్రామస్తులు



వేడుకగా వసంతోత్సవం

- సంప్రదాయబద్ధంగా రాత్రి తోటోత్సవం
- ముగిసిన సంక్రాంతి ఉత్సవాలు

చంద్రగిరి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మూల స్థాన ఎల్లమ్మ ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన బుధవారం కొండచుట్టును ముగిం చుకుని గురువారం మధ్యాహ్నం అమ్మవారు, ధర్మ రాజులవారితో కలసి ఆలయానికి చేరుకున్నారు. అగరాల, ఐతేపల్లి, పుల్లిత్తివారిపల్లి, కొటాల, రామిరెడ్డిపల్లి, రెడ్డివారిపల్లి మీదుగా అమ్మవారు అలయానికి చేరుకున్నారు. ఆయా గ్రామ ప్రజలు అమ్మవారికి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వ హించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు అమ్మవారు ఊరేగుతూ ఆయా గ్రామాల్లో భక్తులను కటాక్షించారు. ఆలయానికి చేరుకున్న అమ్మవారు గ్రామ వీధుల్లో ఊరేగుతూ వసంతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా చందనపు నీళ్లను భక్తులపై చల్లుతూ, అమ్మవారు దర్శనమిచ్చారు. తదుపరి రాత్రి అమ్మ వారు అశ్వవాహనంపై ఆశీనులై, ఆలయం నుంచి ఊరేగింపుగా కొత్తపేటలోని బ్రహ్మంగారి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. తదుపరి అమ్మవారికి మంగళ వాయిద్యాల నడుమ తోటోత్సవాన్ని ఘనంగా నిర్వ హించి ఉత్సవాలను ముగించారు. ఈ కార్యక్రమం లో ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, పాలకమండలి సభ్యులు, ఇతర సిబ్బం ది, భక్తులు పాల్గొన్నారు.

ఫలించిన 20 ఏళ్ల నిరీక్షణ

కొండచుట్టు మహోత్సవంలో తమ గ్రామానికి అమ్మవారు రాకపోవడంతో 20 ఏళ్లుగా ఎగువ రెడ్డివారిపల్లి గ్రామస్తులు నిరీక్షిస్తూ వచ్చారు. వర్షాల కారణంగా స్వర్ణముఖినదిలో దారి సమస్య ఉండడంతో ప్రతి ఏడాది అమ్మవారు రోడ్డుపై చం ద్రగిరికి చేరుకునేవారు. ఈ క్రమంలో వైఎస్‌ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహి త్‌రెడ్డి ఆదేశాలతో ఏఎంసీ చైర్మన్ కొటాల చంద్రశేఖ ర్‌రెడ్డి దారి సమస్యను పరిష్కరించారు. దీంతో తమ గ్రామంలోకి ధర్మరాజ సమేత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారు రావడం శుభప్రదమని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. గురువారం ఎగువరెడ్డివారిపల్లి గ్రామంలోకి అమ్మవారు 20 ఏళ్ల తర్వాత రావడంతో గ్రామస్తులు ఆనందోత్సాహాల మధ్య అమ్మవారికి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలోకి వచ్చిన అమ్మవారికి ధూపదీపాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏడాది ఈ ఆనవాయితీని కొనసాగించాలని గ్రామ స్తులు కోరారు. అనంతరం సర్పంచ్ రేవతి ప్రకాష్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు, గ్రామపె ద్దలు చిత్తరంజన్‌రెడ్డి, పూల నాగరాజులు అమ్మవా రికి సారెను సమర్పించారు.

● టీటీడీ ఉద్యోగుల విన్నపం



తిరుపతిలో పనిచేస్తున్న టీటీడీ అన్‌స్కిల్డ్ ఉద్యోగులు ఎమ్మెల్యే అభ్యర్థి డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని కలసి వారి సమస్యపై విన్నవించారు. తిరుమల ఉగ్రాణంలో పని చేస్తున్న వారిని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సహకారంతో బోర్డులో ఆమోదింపచేసి స్కిల్డ్ ఉద్యోగులుగా పరిగణించి వేతనాలు పెంచే విధంగా చేశారు. తాము కూడా అదే ఉద్యోగుల కోవలోకి వస్తామని తమను కూడా స్కిల్డ్ ఉద్యోగులుగా పరిగణిం చాలని కోరారు. తక్షణమే డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి స్పందిస్తూ సంబంధిత టీటీడీ అధికారులతో పరిష్కారం దిశగా చర్చించారు.

– తిరుపతి తుడా

తిరుపతి సమగ్రాభివృద్ధే లక్ష్యం

తిరుపతి తుడా: నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా తాము ముందుకెళుతున్నట్లు వైఎస్‌ఆర్ సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త, నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పేర్కొన్నారు. కేటీరోడ్డులోని టీటీడీ పరిపాలన భవనం నుండి భవాని నగర్, రైల్వే కాలనీలను కలుపుతూ నిర్మిస్తున్న కందాడై రామానుజ అయ్యం గార్ మార్గం అభివృద్ధి పనులను అధికారులతో కలిసి భూమన అభినయ్ గురువారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరు కుగా ఉన్న ఈ రోడ్డును విస్తరించి వివిధ ప్రాంతా లకు కనెక్టివిటీ పెంచడమే ప్రధాన ఉద్దేశమని తెలి పారు. నగరంలో 18 మాస్టర్ ప్లాన్ రోడ్లు, 12 కనెక్టి విటీ రోడ్లు, 16 లింక్ రోడ్లను అభివృద్ధి చేశామ న్నారు. ఈ రహదారుల అభివృద్ధితో తిరుపతి నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీరడంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి సులభమైన రాకపోకలకు అను వుగా ఉందన్నారు. 18 మాస్టర్ ప్లాన్ రోడ్లతో తిరుపతి నగరం మరో 5 వేల ఎకరాల్లో విస్తరించ నుందన్నారు. నగర తూర్పు ప్రాంతం మరో నాలు గైదేళ్లలో రూపురేఖలు మారేలా అభివృద్ధి ఉందని



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డెప్యూటీ మేయర్‌భూమన అభినయ్‌రెడ్డి

చెప్పారు. నగరంలోని ప్రతి వీధికి సీసీ రోడ్లు వేయడం, మురుగు కాలువలు నిర్మించడం, యూడీఎస్ కనెక్షన్లను అందుబాటులోకి తెచ్చేం దుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామ న్నారు. కందాడై రామానుజ అయ్యంగార్ రహదా రిని త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ వెంకటే శ్వర్‌రెడ్డి, 35వ డివిజన్ అధ్యక్షుడు దినేష్ రాయల్, టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ తాళ్లూరు ప్రసాద్, చం దు రాయల్, డీఈ విజయ్‌కుమార్ రెడ్డి, కాంట్రాక్టర్ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

పటిష్టంగా కులగణన

- నేటి నుంచి పది రోజులపాటు క్షేత్రస్థాయి సర్వే
- కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ పరి ధిలోని పటిష్టంగా కులగణన చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కులగణనపై నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం అన్ని విభాగాల అధికారులతో కమిష నర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ శుక్రవారం నుండి పది రోజులపాటు సర్వే చేపట్టనున్నామన్నారు. నగరంలో కుల గణన నిర్వహించేందుకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. జనవరి 19 నుంచి 28వ తేదీ వరకు కులగణన



కులగణనపై సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

చేపట్టే క్షేత్ర సిబ్బందికి అన్ని విధాలా సహకరిం చాలని కమిషనర్ హరిత ప్రజలకు పిలుపునిచ్చారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరిం టెండెంట్ ఇంజినీర్ మోహన్, ఎంఈ వెంకట్రా మిరెడ్డి, రెవెన్యూ ఆఫీసర్లు కేఎల్ వర్మ, సేతుమా ధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్‌రెడ్డి, డీసీపీ శ్రీనివా సులు రెడ్డి, ఏసీపీ బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలి

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనానికి తమ సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఎంప్లా యీస్ ఫెడరేషన్ (ఏపీజీజేఈఎఫ్) అధ్యక్షుడు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ తెలిపారు. ఆ మేరకు గురువారం ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఓ) జీవీ.ప్రభాకర్ రెడ్డిని క లిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల సీనియారిటీ ఉన్న అధ్యాపకులకు సముచిత స్థానం కల్పించాలని ఆర్ఐఓను కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఆర్ఐఓను కలిసిన వారిలో ఆ ఫెడరేషన్ కార్య దర్శి డాక్టర్ జలగం రామానుజులు, ఉపాధ్య క్షులు ఎస్.చెంగల్‌రాజు, ఏ.సురేంద్ర, మహిళా కార్యదర్శి పీ.సావిత్రిబాయి, గౌరవ సలహా దారు కే.మునిరత్నం, సభ్యులు సంజీవరావు, డాక్టర్ శోభ సుప్రజారాణి, రమాదేవి, వెంకట సురేష్, భరణికుమార్, సోమనాథ్, రాజా రత్నం ఉన్నారు.



● నివాళి

పెద్దకాపు వీధికి చెందిన సమాధి గురుప్రసాద్ యాదవ్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి – తిరుపతి తుడా

నేడు టీటీడీ పెన్షనర్స్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ పెన్షనర్స్ సంఘం నేత పొన్నా భాస్కర్

తిరుపతి కల్చరల్: తుమ్మలగుంట మార్గంలోని శివా లయం వద్ద శుక్రవారం ఉదయం 10.30 గంటలకు టీటీడీ పెన్షనర్స్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తు న్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పొన్నా భాస్కర్ తెలిపారు. ఈ సమావేశానికి ఎస్వీ పూర్ హోమ్, ఎస్వీ డైరీ ఫారం వద్ద 2008లో ఇంటి స్థలాలు పొందిన టీటీడీ పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు తప్పక హాజరు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లా డారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజ శేఖరరెడ్డి ఇచ్చిన జీవో ద్వారా టీటీడీలో 1973 నుం చి 1980 ప్రాంతంలో శానిటరీ వర్కర్ స్థాయి నుం చి వివిధ హోదాలకు చెందిన ఉద్యోగులకు ఎస్వీ పూర్‌హోమ్, ఎస్వీ డైరీ ఫారం వద్ద ఇంటి స్థలాలు మంజూరు చేశారని తెలిపారు. దీనిపై కోర్టులో కేసు నడుస్తుండడంతో టీటీడీ సీనియర్ న్యాయవాదిని నియమించి పెన్షనర్లకు న్యాయం చేయాలని కోరారు. చిన్నయ్య, నాగరాజు, మల్లం మోహన్ రెడ్డి, శ్రీనివాస్, సెల్వరాజ్, గుణశేఖర్, మల్లికా ర్జున, పీతాంబరరాజు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



శ్రీవారి సేవలో తెలంగాణ ఎంపీ రంజిత్‌రెడ్డి, బాలీవుడ్ నిర్మాత ఏక్తా కపూర్

తిరుమల: శ్రీవారిని గురువారం తెలంగాణ ఎంపీ రంజిత్‌రెడ్డి, బాలీవుడ్ చిత్ర పరిశ్రమ నిర్మాత ఏక్తా కపూర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనా యకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధి కారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

తిరుపతి సిటీ: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యా లయం వ్యవస్థాపకుడు నందమూరి తారక రామా రావు వర్ధంతి సందర్భంగా వర్సిటీలోని ఆయన విగ్రహానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజిని గురు వారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుజాత, కాత్యాయని, డిప్యూటీ రిజిస్ట్రార్ గీత వాణి, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పద్మావతి వర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది

ఫిబ్రవరి 10 నుంచి దేవుని కడపలో బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): వైఎస్‌ఆర్ కడప జిల్లా దేవుని కడపలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వ రస్వామి ఆలయంలో ఫిబ్రవరి 10 నుంచి 18 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. ఫిబ్రవరి 9వ తేదీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల మధ్య అంకురా ర్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం చేపట్టను న్నారు. రూ.300 చెల్లించి గృహస్తులు(ఇద్దరు) కల్యాణోత్సవంలో పాల్గొన వచ్చు. ఫిబ్రవరి 19వ తేదీ సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం నిర్వహిం చనున్నారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమా చార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో రోజూ హరికథలు, భక్తి సంగీత ఆధ్యాత్మిక కార్య క్రమాలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 10న ఉదయం ధ్వజారోహణం, రాత్రి చంద్రప్రభ వాహనం, 11న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి పెద్దశేష వాహనం, 12 ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి సింహ వాహనం , 13 ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనం, 14న ఉదయం ముత్యపుపందిరి వాహనం, రాత్రి–గరుడ వాహనం, 15న ఉదయం కల్యాణోత్సవం, రాత్రి గజ వాహనం, 16 ఉదయం రథోత్సవం, రాత్రి ధూళి ఉత్సవం, 17న ఉదయం సర్వభూపాల వాహనం, రాత్రి అశ్వ వాహనం, 18 ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి హంసవాహనం , ధ్వజావరోహణం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

కోర్టులో లొంగిపోయిన నిందితుడు

తిరుపతి లీగల్: హత్యాయత్నం కేసులో నిందితు డిగా అభియోగాలు ఎదుర్కొంటున్న ఎం.కిరణ్‌కు మార్ గురువారం తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయాడు. ఇతను తిరుపతి ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి న్యాయమూర్తి 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి శ్రీనివాసనగర్‌కు చెందిన పి.ఉష ఆమె భర్తతోపాటు ఇతరులపై ఈ నెల 13వ తేదీ కత్తులతో దాడి జరిగింది. దీంతో తిరుపతి శ్రీనివాస నగర్‌కు చెందిన ఎ.భానుప్రకాష్ అలియాస్ భాను, పి.జగదీష్‌కుమార్ అలియాస్ జగ్గు, ఈ.రితేష్‌బాబు, ఈ.అజయ్, ఎం.కిరణ్‌కుమార్‌లతోపాటు మరో ఇద్దరు కత్తులతో దాడి చేసి హత్యాయత్నంకు పాల్ప డినట్లు ఆమె తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వెస్ట్ పోలీసులు రెండు రోజుల క్రితం భానుప్రకాష్, జగదీష్‌కుమార్, రితేష్‌బాబు, అజయ్ లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

చీటింగ్ అప్పీలు కేసులో మహిళకు మూడేళ్ల జైలు

తిరుపతి లీగల్: మోసం చేసిన కేసులో పిచ్చాటూరు మండలం కొత్తూరు దళి తవాడకు చెందిన పి.మంజులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ గురువారం తీర్పు చెప్పారు. నిందితురాలు మంజుల రుణాలు తీసిస్తానని మాయ మాటలు చెప్పి రూ.3,30,400 తీసుకొని, వారికి ఎటువంటి రుణాలు అందివ్వలేదు. దీనిపై స్వయం సహాయక బృందంలోని సభ్యుడు ఎంజీ.అన్బలగన్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు మంజులతోపాటు టౌన్ మిషన్ కో–ఆర్డినేటర్ గోపిపై కేసు నమోదు చేసి నగరి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి మంజులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ 2019లో తీర్పు చెప్పారు. గోపిపై కేసును కొట్టివేశారు. ఆ తీర్పుపై అమె తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టులో అప్పీలు దాఖలు చేసుకున్నారు. వాద నలు విన్న న్యాయమూర్తి కింది కోర్టు విధించిన శిక్షను ఖరారు చేశారు.

హత్యాయత్నం కేసులో ఏడుగురు అరెస్ట్

తిరుపతి రూరల్: ఈ నెల 15 న విద్యానగర్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద పవన్ అనే వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో ఏడుగు రిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. జనా ర్ధన్ కాలనీకి చెందిన పవన్పై పాత కక్షలతో అదే వీధికి చెందిన ఏడుగురు యువకులు కర్రలు రాడ్లతో దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన పవ న్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు చేసిన విషయం విదితమే. ఈ కేసులో ఏడుగురు యువ కులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు యువ కులను రిమాండ్కు తరలించారు. నలుగురు మైనర్లు కావడంతో జువైనల్ హోమ్‌కు తరలిం చారు. ఈ వివరాలను తిరుపతి రూరల్ ఎస్ఐ ఎస్.నాగేంద్రబాబు వెల్లడించారు.

ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా జగనన్న పాల వెల్లువ

భాకరాపేట: సహకార డెయిరీ రంగాన్ని బలోపేతం చేసేందుకు జగనన్న పాల వెల్లువ ఎంతో దోహద పడుతుందని జగనన్న పాల వెల్లువ ఇన్‌చార్జి అధికారి రవిబాబు అన్నారు. గురువారం మండ లంలోని నెల్లుట్లవారిపల్లెలో గ్రామ సర్పంచ్ శశిప్రియ అధ్యక్షతన జగనన్న పాల వెల్లువ అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాడి రైతులకు మేలు చేసే సహకార సంస్థ తిరిగి బలోపేతం చేసేందుకు జగనన్న పాలవెల్లువ దోహదపడుతుందన్నారు.

పేదలకు అన్నదానం, దుస్తులు పంపిణీ



తిరుపతి కల్చరల్: శ్రీవేంకటపద్మావతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తూరు వినాయకనగర్‌లో నిరు పేదలకు గురువారం అన్నదానం, వస్త్రదానం చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు నందిపాటి చక్రపాణి తన తండ్రి 22వ వర్ధంతిని పురస్కరించుకొని 200 మంది పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు.

పేదలకు వస్త్రదానం చేస్తున్న శ్రీవేంకటపద్మావతి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు



తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీలో హెల్తీ విలేజ్ పేరుతో జాతీయ సదస్సు ప్రారంభమైన సందర్భంగా రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు –సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి